క్లుప్తంగా

ఘనంగా మహాలక్ష్మి అమ్మవారి ఉత్సవాలు



గుడ్లవల్లేరు: మండలంలోని కౌతవరంలో తొమ్మిదేళ్లకు ఒకసారి జరిగే మరిడి మహాలక్ష్మి అమ్మవారి ఉత్సవాలు బుధవారం కొనసాగాయి. పోతురాజు గెడ ఊరేగింపును ఉత్సవ కమిటీ వారు సంప్రదాయ బద్ధంగా గ్రామంలోని ప్రధాన రహదారుల వెంబడి నిర్వహించారు. కనక డప్పుల వాయిద్యాలతో కొనసాగిన ఈ ఊరేగింపునకు మహిళా భక్తులు అడుగడుగునా పండ్లు, టెంకాయలను సమర్పించి నీరాజనాలు అర్పించారు.

12న పూలే దంపతుల విగ్రహాల ఆవిష్కరణ



గుడ్లవల్లేరు: జ్యోతీరావ్ పూలే, సావిత్రీబాయి పూలే దంపతుల విగ్రహాలను గుడివాడలో మే 12న ఆవిష్కరించనున్నామని బీసీ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావులకొల్లు వెంకట మల్లేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను బుధవారం కొండిపాలెంలోని వైఎస్సార్ సీపీ నాయకుడు పామర్తి శ్రీరాములు నివాసంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీసీ సంఘ గుడివాడ అధ్యక్షుడు దారం నరసింహారావు, ఉపాధ్యక్షుడు నయనవరపు శేషుబాబు, పుట్టి వెంకటేశ్వరరావు, నాయకులు మన్నెం వీర రాఘవులు, హరిబాబు, అంజిబాబు పాల్గొన్నారు.

జెడ్పీ మాజీ చైర్మన్‌కు సతీవియోగం



గుడివాడ టౌన్ (నందివాడ): ఉమ్మడి కృష్ణా జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ పిన్నమనేని కోటేశ్వరరావు సతీమణి, మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు మాతృమూర్తి పిన్నమనేని రాజమ్మ (88) బుధవారం కన్నుమూశారు. నందివాడ మండలం రుద్రపాక గ్రామంలోని ఆయన నివాసంలో మృతి చెందారు. ఆమెకు నలుగురు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఈమె మృతికి పలువురు రాజకీయ నాయకులు, అభిమానులు విచారం వ్యక్తం చేశారు. గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని), విజయవాడ ఎమ్మెల్యే గద్దె రామ్మోహనరావు, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ గద్దె అనూరాధ, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, సోషలిస్ట్ పార్టీ నాయకుడు పిన్నమనేని భూపతిరాయుడు, మాజీ మంత్రి కఠారి ఈశ్వరకుమార్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామినేని వెంకటకృష్ణ, జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ శ్రీరాజబాబు, సెంట్రల్ విజిలెన్స్ మాజీ చైర్మన్ కేవీ చౌదరి, తదితరులు సంతాపం తెలిపారు.

విద్యార్థుల భవిష్యత్తుకు దారిచూపిన 'దిట్టకవి'

గుడివాడ టౌన్: ప్రముఖ వ్యాపారవేత్త టైపు, షార్టు హ్యాండ్ శిక్షణ సంస్థ నిర్వాహకుడు దిట్టకవి శ్యామసుందరశర్మ (శ్యామ్) నిబద్ధత కలిగిన వ్యాపారవేత్త అని పలువురు వక్తలు అన్నారు. ఈనెల 15న మరణించిన దిట్టకవి శ్యాంసుందరశర్మ సంస్మరణ కార్యక్రమాన్ని స్థానిక ఆంజనేయపేటలోని ఆయన నివాసం వద్ద నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణంలో సుమారు 45 ఏళ్లపాటు టైపు, షార్టుహ్యాండ్‌లో విద్యార్థులకు శిక్షణ ఇచ్చి, ఎంతో మందికి భవిష్యత్ కల్పించిన గొప్పవ్యక్తి శ్యామసుందర శర్మ అని వక్తలు పేర్కొన్నారు. ఆయన మృతి తీరనిలోటన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ లంకదాసరి ప్రసాదరావు, బీజేపీ అధ్యక్షుడు రామినేని వెంకటకృష్ణ, రావి శ్రీనివాసచౌదరి, ఉపద్రష్ట శంకరశాస్త్రి, ఉపద్రష్ట రాంబాబు, ఘంటసాల మోహనరావు, న్యాయవాది జీఎల్ఎన్‌వీ అప్పాజీ నివాళులు అర్పించారు.

రెండెకరాల గడ్డివామి దగ్ధం

కాజ(మొవ్వ): మొవ్వ మండలం కాజ గ్రామంలో బుధవారం జరిగిన అగ్నిప్రమాదంలో రెండు ఎకరాల గడ్డివామి దగ్ధమైంది. మొవ్వ ఫైర్ అధికారి కే వెంకటేశ్వరరావు తెలిపిన సమాచారం మేరకు.. కాజ గ్రామానికి చెందిన మురాల తిరుపతిరావు రెండు ఎకరాల గడ్డి వాముకి కేర్ లెస్ స్మోకింగ్ కారణంగా ప్రమాదం సంభవించిందని, ఈ ప్రమాదంలో 20 వేల ఆస్తినష్టం వాటిల్లిందని వెల్లడించారు.

గుడివాడ డీఎస్పీగా శ్రీకాంత్



గుడివాడరూరల్: గుడివాడ డీఎస్పీగా పి.శ్రీకాంత్ నియమితులయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన డీఎస్పీల బదిలీల్లో భాగంగా చీరాల డీఎస్పీగా పని చేస్తున్న శ్రీకాంత్‌ను గుడివాడ డీఎస్పీగా బదిలీ చేశారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేస్తున్న డీఎస్పీ ఎం.సత్యానందం బదిలీ అయ్యారు.

ప్రతి కుటుంబంలో సంక్షేమాల సంబరం

- ఎమ్మెల్యే డీఎన్నార్, ఎమ్మెల్సీ జయమంగళ
- 'జగనన్నే మా భవిష్యత్తు' కోటికి పైగా గృహాల సందర్శన



కోటి కుటుంబాలకు చేరిన పోస్టర్లను చూపిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్, ఎమ్మెల్సీ జయమంగళ

కైకలూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న ప్రజాసంక్షేమ పథకాలతో రాష్ట్రంలో ప్రతి కుటుంబం సంతోషంగా జీవిస్తోందని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ అన్నారు. 'జగనన్నే మా భవిష్యత్తు' మెగా పీపుల్స్ సర్వే రాష్ట్రంలో ఒక కోటికి పైగా కుటుంబాలను కలిసిన సందర్భంగా బుధవారం కైకలూరు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే డీఎన్నార్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు 90 లక్షల ప్రజలు సెల్ ఫోన్ల ద్వారా మిస్డ్‌కాల్స్ ఇచ్చారన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో రాష్ట్రంలోనే మొదటి స్థానాన్ని కైకలూరు నియోజకవర్గం సాధించిందన్నారు. ఈ నెల 29 నాటికి 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమంలోనూ ప్రథమ స్థానాన్ని సాధిస్తామనే ధీమాను వ్యక్తం చేశారు. పార్టీ నాయకులు, వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు కృషి వల్లే రాష్ట్ర స్థాయిలో నియోజకవర్గానికి మంచి పేరు వచ్చిందన్నారు. ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ మాట్లాడుతూ తెలుగుదేశం పాలనలో జన్మభూమి కమిటీల పేరుతో ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్ల ద్వారా అందించిన రుణాల్లో కమిషన్లు దోచుకున్న మాట వాస్తవమేనన్నారు. నేడు సీఎం జగన్ ఒక్క రూపాయి అవినీతి లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు నగదు జమా చేస్తున్నారని కొనియాడారు. గతంలో టీడీపీ ఇన్‌చార్జిగా ఉన్న తాను జగనన్న వసతి దీవెను విమర్శించానన్నారు. ఈ పథకం ఎంతో మంది పేద విద్యార్థులకు సాయపడుతుందో ఇప్పుడు అవగతమవుతోందన్నారు. కైకలూరు నియోజకవర్గంలో 4,162 మంది విద్యార్థులకు రూ.3.94 కోట్లు జగనన్న వసతి దీవెన కింద నిధులు విడుదల చేశారన్నారు. ఎమ్మెల్యే డీఎన్నార్ నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో దాదాపు 80 వేల గృహాలను 214 రోజులు గడప గడపకు కార్యక్రమం ద్వారా ప్రతి కుటుంబాన్ని పలకరించారన్నారు. ఒక కోటి కుటుంబాలకు 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం చేరిన సందర్భంగా రూపొందించిన పోస్టర్లును ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాలుగు మండలాల ఎంపీపీలు అడవి కృష్ణ, చందన ఉమామహేశ్వరరావు, పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్, కైకలూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ దండే పుష్పలత, మండవల్లి జెడ్పీటీసీ సభ్యురాలు ముంగర విజయనిర్మల, కైకలూరు సర్పంచ్ దానం మేరీ నవరత్నకుమారి, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షులు భట్రాజు శివాజీ, తిరుమాని రమేష్, మోట్రూ ఏసుబాబు, సర్పంచ్‌ల సంఘ మండలాధ్యక్షుడు చెరుకువాడ బలరామరాజు, మండవల్లి వైస్ ఎంపీపీ అగస్తి ఆదివిష్ణు, కలిదిండి ఏఎంసీ వైస్ చైర్మన్ పాము రవికుమార్, పెంచికలమర్రు సర్పంచ్ జయమంగళ కాసులు, నాయకులు సయ్యపురాజు గుర్రాజు, ఈడే వెంకటేశ్వరరావు, దండే రవిప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే లక్ష్యంగా పాలన

- ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్
- నిడుమోలులో గడప గడపకు మన ప్రభుత్వం



ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్

నిడుమోలు(మొవ్వ): పేదల సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ ఆధ్వర్యంలో పాలన సాగుతోందని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ అన్నారు. మొవ్వ మండలం నిడుమోలులో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ అధికారులు, ప్రజా ప్రతినిధులు, వలంటీర్లతో కలిసి ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ పాలనలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. ఆయా కుటుంబాలకు సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నదీ లేనిది అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ మాట్లాడుతూ సంక్షేమ ఫలాలను నేరుగా ఇంటి వద్దకే అందించిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. గతంలో జన్మభూమి కమిటీల చేతులు తడిపితేనే పనులు అయ్యేవని, కానీ నేడు మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా నేరుగా తమతమ ఖాతాల్లో సొమ్ము జమవుతు న్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొండేటి ఇందిర, వైస్ ఎంపీపీలు డొక్కు వెంకటేశ్వరరావు, కందుల వెంకట కోటేశ్వరరావు(కొండలు), గ్రామ సర్పంచ్ కొమరగిరి అంజిలి, పీఏసీఎస్ చైర్మన్ పుట్టి రామకృష్ణ, గ్రామ మాజీ సర్పంచ్ చిన్నం రత్నాబాయి, ఉప సర్పంచ్ డొక్కు మురళి, తహసీల్దార్ సీహెచ్ వీరాంజనేయులు, ఎంపీడీవో జి.సుధాప్రవీణ్, పార్టీ కన్వీనర్ గొరిపర్తి వెంకటేశ్వరరావు, నాయకులు వరిగంజి నిరంజనరావు, పామర్తి గంగాధరరావు, వివిధ శాఖల అధికారులు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

పేదల భూములకు నష్టం కలిగించొద్దు

హైవే అధికారులకు ఎమ్మెల్యే డీఎన్నార్ సూచన



హైవే భూములను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్, హైవే అధికారులు

కైకలూరు: జాతీయ రహదారి విస్తరణ పనుల్లో పేదల భూములకు నష్టం కలిగించకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లను పరిశీలించాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) కోరారు. గోపవరం గ్రామానికి చెందిన పలువురు నివాసితులు ఇటీవల 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యే డీఎన్నార్‌కు తమ భూములు, గృహాలు రహదారి విస్తరణ పరిధిలోకి వెళుతున్నాయని గోడువెళ్లబోసుకున్నారు. దీంతో ఎమ్మెల్యే నేషనల్ హైవే ఈఈ జి.సంజీవరాయుడు, డీఈ సత్యనారాయణను గోపవరానికి పిలిపించి పరిస్థితిని వివరించారు. గ్రామంలో పుంతపోరంబోకు భూమి ఖాళీగా ఉందని, దానిని పరిశీలించాలని కోరారు. సర్వే చేపట్టి సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తామని హైవే అధికారులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఉలిసి శ్యామ్‌బాబు, మాగంటి వేణు, పెన్మత్స దుర్గరాజు, గుండ్రెడ్డి నాగేశ్వరరావు, గుండ్రెడ్డి కాశీ, దాసరి రామలింగం, పోలవరపు శ్రీనివాసరావు, గెద్దాడ కోటేశ్వరరావు, మురాల రామారావు, ఏడబ్ల్యూ ఏఈ శరత్ చంద్ర, పలువురు సర్వేయర్లు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ కాలేజీ విద్యార్థుల ప్రతిభ



ప్రథమ స్థానం సాధించిన ఇంటర్ ద్వితీయ సంవత్సర విద్యార్థినులు



ప్రథమస్థానం సాధించిన ఇంటర్ మొదటి సంవత్సర విద్యార్థినులు

మొవ్వ: స్థానిక క్షేత్రయ్య జూనియర్ ప్రభుత్వ కళాశాల విద్యార్థులు బుధవారం విడుదలైన ఇంటర్ పరీక్షల్లో జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారని కళాశాల ప్రిన్స్‌పాల్ బీఎస్ఆర్‌వీ ప్రసాద్ వెల్లడించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం జగరల్ విభాగంలో 74.43 శాతం, ఒకేషనల్ విభాగంలో 84 శాతాన్ని సాధించారని, మొదటి సంవత్సరం జనరల్ విభాగంలో పరీక్షల్లో 62 శాతాన్ని, ఒకేషనల్ విభాగంలో 59 శాతాన్ని సాధించినట్లు ప్రిన్స్‌పాల్ తెలిపారు. ద్వితీయ సంవత్సరంలో జనరల్‌లో విభాగంలో ఎంపీసీ విద్యార్థిని జీనత్ జాన్ 959 మార్కులతో, ఒకేషనల్ విభాగంలో సయ్యద్ కరిష్మ 949 మార్కులతో ప్రథమస్థానంలో నిలిచారు. మొదటి సంవత్సర పరీక్షలో జనరల్ విభాగం ఎంపీసీలో శ్రీ విద్య 441 మార్కులతో, సీఈసీలో 443 యద్దనపూడి గోవర్ధనలు ప్రథమ స్థానంలో, ఒకేషనల్ విభాగంలో నాగ హర్షిత 486 మార్కులతో ప్రథమస్థానంలో నిలిచారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో బాలికలే ప్రథమ స్థానాల్లో ఉండటం విశేషం.

ఆపద్బంధువుగా సంచార పశువైద్య వాహనం

ఆవుదూడను రక్షించిన సిబ్బంది



ప్రమాదంలో దెబ్బతిన్న ఆవుదూడ వద్ద స్థానికులు

కైకలూరు: మనుషులకే కాదు.. మూగజీవాల ప్రాణాలకు రక్షణ కల్పించడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంచార పశువైద్యశాల వాహనం సత్ఫలితాలనిస్తోంది. స్థానిక కోరుకొల్లు రోడ్ ఏడీబీ బ్యాంకు వద్ద రోడ్డు దాటుతున్న 5 నెలల వయస్సు కలిగిన ఆవు దూడను బుధవారం లారీ ఢీకొట్టి వేగంగా వెళ్లిపోయింది. దూడ కాలు, నడుముకు తీవ్ర గాయాలయ్యాయి. విషయాన్ని గమనించిన స్థానికుడు తులశి పూర్ణ 1962 టోల్‌ఫ్రీ నంబర్ ద్వారా పశువైద్యులకు సమాచారం అందించారు. దీంతో పశువైద్యులు పవన్ సిబ్బందితో వచ్చి ఆవుదూడకు ఇంజెక్షన్లు చేసి కట్లు కట్టారు. ప్రాణాపాయం లేదని చెప్పారు. దూడకు ప్రతి రోజూ చికిత్స అందిస్తామని తెలిపారు. ఈ ఘటనతో సంచార పశువైద్య వాహన సేవలను ప్రజలు కొనియాడారు.

మజ్జిగ పంపిణీ కేంద్రం ప్రారంభం



గుడివాడ టౌన్: వాసవీక్లబ్ సేవా కార్యక్రమాలు అభినందనీయం అని పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ ప్రసాదరావు అన్నారు. స్థానిక బంటుమిల్లి రోడ్‌లోని భీమేశ్వరస్వామి దేవస్థానం ఎదురుగా బుధవారం వాసవీక్లబ్ గుడివాడ ఆధ్వర్యంలో యక్కలి గురునాథం జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన మజ్జిగ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రద్దీగా ఉండే వ్యాపార కూడలి ప్రాంతంలో మజ్జిగ పంపిణీ కేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీ యమన్నారు. ఈ కార్యక్రమంలో గుడివాడ ఆర్యవైశ్య సంఘ చైర్మన్ జవ్వాజి గంగరాజు, ఏఎస్ఐ భాగ్యవతి, క్లబ్ అధ్యక్షుడు తిరివీధి వెంకట సుబ్బారావు, కార్యదర్శి చక్కా రామ్‌సుధీర్, కోశాధికారి యక్కలి మణిదీప్ తదితరులు పాల్గొన్నారు.

జగన్నాథుడి కల్యాణోత్సవాలకు శ్రీకారం



కల్యాణోత్సవాలకు రాట పూజ చేస్తున్న పాలకవర్గ సభ్యులు

ముదినేపల్లి రూరల్: మండలంలోని వడాలి శ్రీజగన్నాథస్వామి వార్షిక కల్యాణ మహోత్సవాల పనులకు బుధవారం శ్రీకారం చుట్టారు. ఆలయ చైర్మన్ మర్రివాడ సుబ్బలక్ష్మి, ఈఓ శింగనపల్లి శ్రీనివాసరావు, పాలకవర్గ సభ్యుల ఆధ్వర్యంలో రాట పూజను నిర్వహించారు. ఈ పూజ అనంతరం కల్యాణోత్సవాలకు సంబంధించి ఇతర పనులు ప్రారంభించేందుకు అవకాశం ఉంటుందని చైర్మన్, ఈవో తెలిపారు. కల్యాణోత్సవాలు మే 3 నుంచి 7వ తేదీ వరకు నిర్వహిస్తారు. ఆలయ ప్రధాన అర్చకుడు అగ్నిహోత్రం శ్రీనివాసాచార్యులు రాట పూజను నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు ఈడే వెంకటేశ్వరమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు పల్లి శ్రీదేవి, స్థానిక నేతలు మరీదు రాధా, మర్రివాడ వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన



ఐనంపూడిలో కూలీల వివరాలు తెలుసుకుంటున్న ఏపీవో పోలురాజు

అడ్డాడ(పామర్రు): గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనులను ఏపీవో పోలురాజు బుధవారం పరిశీలించారు. మండల పరిధిలోని అడ్డాడలోని నర్సరీని, ఐనంపూడి గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వేసవిలో ఉపాధి హామీ పథకం కింద కూలీలతో మొక్కల సంరక్షణ చేస్తున్నామన్నారు. ఐనంపూడి గ్రామంలో పంట బోదెల పూడిక తీత పనులను పరిశీలించి, అక్కడ పనులు చేసిన కూలీల వివరాలను నమోదుచేశారు. మండలంలోని పరిధిలోని 25 గ్రామ పంచాయతీల్లో 2,800 మంది కూలీలు పనులు చేశారని అన్నారు. అన్ని గ్రామాల్లో ప్రస్తుతం పంట బోదెల పూడిక తీత పనులు చేపట్టామన్నారు. ఫీల్డు అసిస్టెంట్‌లు, మేట్లు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోవాలి

మండవల్లి: ఉపాధి హామీ పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఎంటీఏ నవీన్ పేర్కొన్నారు. మండలంలోని కానుకొల్లు గ్రామంలో రూ.2 లక్షల 23 వేలతో పంట కాలువ పనులను బుధవారం 74 మంది కూలీలు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎంటీఏ మాట్లాడుతూ ఉపాధి పనుల వల్ల రైతుల పంట పొలాలు బాగుపడి అధిక దిగుబడులు సాధించే వీలు కలుగుతుందన్నారు. తాగునీటి, సాగునీటి సమస్యలు తీరుతున్నాయని పేర్కొన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

ఒకటి నుంచి లూర్దుమాత మహోత్సవాలు



మాట్లాడుతున్న విచారణ గురువు కిషోర్, సహాయక గురువు కిరణ్

మండవల్లి: మండలంలోని భైరవపట్నంలో మే ఒకటో తేదీ నుంచి మూడు రోజుల పాటు లూర్దుమాత మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు విచారణ గురువు నూతలపాటి కిషోర్, సహాయక గురువు బండి కిరణ్ బుధవారం చెప్పారు. స్థానిక విచారణ గురువు నివాసంలో బుధవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఇటలీ దేశానికి చెందిన క్రైస్తవ మత గురువులు ఈ గ్రామంలో రోమన్ కెథోలిక్ మిషన్ విచారణ కేంద్రంగా 1949లో ప్రారంభించినట్లు పేర్కొన్నారు. భైరవపట్నం గ్రామంలో మరియ మాత మహోత్సవాలు 30 సంవత్సరాల నుంచి జరుగుతున్నాయని తెలిపారు. విచారణలో 13 గ్రామాలు ఉన్నట్లు పేర్కొన్నారు. 3న బిషప్ వెలగతోటి జోసఫ్ రాజారావుతో దివ్య బలి పూజ నిర్వహించనున్నట్లు వివరించారు.

గ్రామాభివృద్ధికి సర్పంచ్ ఝాన్సీ కృషి



సర్పంచ్ ఝాన్సీ దంపతులను సత్కరిస్తున్న ఎంపీపీ శ్రీరామదుర్గాప్రసాద్ తదితరులు

మండవల్లి: మండవల్లి గ్రామ పంచాయతీ అభివృద్ధికి సర్పంచ్ మెండా ఝాన్సీ చేసిన కృషి అభినందనీయమని ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్ అన్నారు. పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ నుంచి హెల్దీ పంచాయతీ అవార్డు తీసుకున్న సందర్భంగా స్థానిక నాగేంద్రస్వామి ఆలయం వద్ద సర్పంచి ఝాన్సికి అభినందన సభ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి సర్పంచ్ కృషి వెలకట్టలేనిదన్నారు. ఈ కారణంగానే కలెక్టర్ నుంచి హెల్దీ అవార్డు మండవల్లికి వచ్చినట్లు పేర్కొన్నారు. మాజీ సర్పంచ్ చేబోయిన వీర్రాజు, ముంగర మల్లికార్జునరావు, మెండా సురేష్, ఎల్ఎస్ భాస్కరరావు, వరప్రసాద్, బుంగా రాణి, ఉపాధ్యాయుడు పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్లను సందర్శించిన ఎస్పీ ప్రశాంతి



కలిదిండి పోలీసు స్టేషన్‌లో ఎస్పీ మేరీ ప్రశాంతి

కైకలూరు: నియోజకవర్గంలోని పోలీస్ స్టేషన్లను జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి బుధవారం సందర్శించారు. కైకలూరు టౌన్, రూరల్, కలిదిండి, మండవల్లి పోలీసుస్టేషన్లను ఆమె సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. మండవల్లిలో నూతన పోలీస్ స్టేషన్ భవన నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో కైకలూరు రూరల్, పట్టణ సీఐలు వైవీవీఎల్.నాయుడు, ఎంవీఎస్.నాగరాజు, ఎస్ఐలు జ్యోతిబసు, గాయత్రి, మణికుమార్, షణ్ముఖసాయి, రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు అంబేడ్కర్

ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్



అంబేడ్కర్ విగ్రహావిష్కరణలో విక్టర్ ప్రసాద్ తదితరులు

కృత్తివెన్ను: నేటి సమాజంలో ప్రతి ఒక్కరూ అభివృద్ధి ఫలాలను పొందుతూ ఉన్నత పదవుల్లో ఉన్నారంటే ఆనాడు అంబేడ్కర్ రచించిన రాజ్యాంగమే కారణమని ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ అన్నారు. కృత్తివెన్ను మండలం చినగొల్లపాలెంలో ఏర్పాటుచేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని బుధవారం విక్టర్ ప్రసాద్ ఆవిష్కరించి మాట్లాడారు. అంబేడ్కర్ రాజ్యాంగం ద్వారా కల్పించిన హక్కులతో బహుజనులంతా అన్ని రకాల అభివృద్ధి ఫలాలను పొందగలుగుతున్నారన్నారు. వయోపరిమితితో అందరికీ ఓటు హక్కును ప్రసాదించిన మహానుభావుడు అంబేడ్కర్ అని అన్నారు. ఆయన చూపిన మార్గంలో నడవాలని సూచించారు. కార్యక్రమంలో విగ్రహ దాత బీఎస్ఎన్ఎల్ అర్జా, ఎంపీడీఓ పిచ్చిబాబు, తహసీల్దార్ రామకోటేశ్వరరావు, సర్పంచ్ సునీల్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ స్ఫూర్తితో యువత ముందుకు సాగాలి

మచిలీపట్నంటౌన్: భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్‌ను యువత ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్‌ప్రసాద్ పిలుపునిచ్చారు. స్థానిక సర్కిల్‌పేట ఆర్‌సీఎం చర్చి సమీపంలో ఏర్పాటు చేసిన బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని బుధవారం రాత్రి ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి జీవితాంతం శ్రమించిన వ్యక్తి అంబేడ్కర్ అని చెప్పారు. భారత రాజ్యాంగంలో బడుగు, బలహీనవర్గాల వారికి పలు హక్కులు, రిజర్వేషన్లు పొందుపరచబట్టే నేడు ఆయా వర్గాలు అన్ని విధాలుగా అభివృద్ధి చెందాయని వివరించారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) మాట్లాడుతూ అంబేడ్కర్ సేవలను కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్, మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, డెప్యూటీ మేయర్ లంకా సూరిబాబు, కార్పొరేటర్ ఏకశిరి వెంకటేశ్వరరావు, కో–ఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి, రాష్ట్ర క్రిష్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ జక్కుల ఆనందబాబు మాట్లాడారు. తొలుత సర్కిల్‌పేటలో అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు కృషి చేసి మృతి చెందిన కొండ్రు శామ్యూల్ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

గుడివాడ టౌన్: స్థానిక ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం 4 గంటల నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ప్రారంభమవుతుంది. వైఎస్సార్ సీపీ నాయులు బుధవారం వివరాలు వెల్లడించారు. 3వ వార్డు ఫర్నీచర్ పార్క్ షాపు వద్ద నుంచి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే కొడాలి నాని ప్రజల సమస్యలు తెలుసుకుని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

మట్టితరలిస్తున్న వాహనాల సీజ్

మొవ్వ: అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్న టిప్పర్ లారీ, పొక్లయినర్‌ను సీజ్ చేసినట్టు రెవెన్యూ అధికారులు బుధవారం తెలి పారు. మొవ్వ గ్రామంలోని శివారు పొలాల్లో మంగళవారం సాయంత్రం 6గంటల సమయంలో అనుమతులు లేకుండా మాగాణి పొ లంలో మట్టి తరలిస్తుండగా తహసీల్దార్ సీహెచ్.వీరాంజనేయ ప్రసాద్‌కు సమాచారం రాగా ఆయన ఆదేశాలతో ఆర్ఐ విజయలక్ష్మి, వీఆర్వోవు ఫణికుమార్, జుజ్జువరపు కోటేశ్వరరావులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఆ ప్రాంతంలో ఉన్న వాహనాలను సీజ్ చేసినట్లు ఆర్ఐ వెల్లడించారు. వాహనాలను మొవ్వ తహసీల్దార్ కార్యాలయానికి తరలించినట్లు తెలిపారు.

29 నుంచి డీఎన్నార్ క్రికెట్ టోర్నమెంట్

ముదినేపల్లి రూరల్: స్థానిక బంటుమిల్లి రోడ్డులో డీఎన్నార్ ప్రీమియర్ లీగ్ టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్ ఈ నెల 29న ప్రారంభించనున్నట్లు ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, కమిటీ సభ్యులు దివి సతీష్, మోహన్, ఆదిత్య బుధవారం తెలిపారు. విజేతలకు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) రూ.50 వేలు ప్రథమ బహుమతిగా అందిస్తారన్నారు. తాను రూ.30 వేలు ద్వితీయ బహుమతిని, జెడ్పీటీసీ సభ్యురాలు ఈడే వెంకటేశ్వరమ్మ, వెంకటేశ్వరరావు దంపతులు రూ.20 వేలు తృతీయ బహుమతిని, వైఎస్సార్ సీపీ నేత కోమటి విష్ణువర్ధన్ రూ.10 వేలు నాల్గవ బహుమతిగా అందజేస్తారు. పోటీలో పాల్గొనేందుకు రూ.1500 ఎంట్రీ ఫీజుగా నిర్ణయించినట్లుగా చెప్పారు. ప్రతి మ్యాచ్‌కి మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ షీల్డ్ ఉంటుంది. వివరాలకు 92905 55594, 96765 16572 నంబర్లలో సంప్రదించాలి.